క్లుప్తంగా

నాలుగు నెలల వేతనాలు విడుదల

సాక్షి ఎఫెక్ట్..

బేల: విద్యుత్‌శాఖ అనుబంధ తెలంగాణ విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ సొసైటీ పరిధిలో పనిచేస్తున్న అన్‌స్కిల్డ్ వేతనాలు విడుదల చేసినట్లు ఆదిలాబాద్ డివిజన్ డీఈ హరికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న సాక్షిలో ప్రచురితమైన 'వేతనాల చెల్లింపుల్లో జాప్యం' కథనానికి జిల్లా విద్యుత్ శాఖ స్పందించింది. ఆదిలాబాద్ డివిజన్ పరిధిలోని 66 మంది వర్కర్లకు మొత్తం రూ.22,46,247ను విడుదల చేశామన్నారు. రెండు రోజుల్లో వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని పేర్కొన్నారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డు పరిధిలోని అగర్వాల్ జిన్నింగ్ మిల్లులో మంగళవారం నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు జైనథ్ మార్కెట్ కమిటీ కార్యదర్శి కాంబ్లే మధుకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి నిల్వలు పేపేరుకుపోవడంతో ఈనిర్ణయం తీసుకున్నామన్నారు. మళ్లీ సీసీఐ కొనుగోళ్ల పునఃప్రారంభంపై ప్రకటన చేస్తామన్నారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ

జైనథ్: మండలంలోని ఖాప్రి గ్రామానికి చెందిన భజరంగ్ దళ్ యువజన సంఘం సభ్యులు విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. సోమవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పాయల్ శంకర్ ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా విద్యార్థులకు బ్యాగులు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు దుర్ల సురేశ్, సభ్యులు సునీల్, దుర్ల భగవాండ్లు, కార్తీక్, రవి, హరికృష్ణ, రాజు, సాయికృష్ణ, యాదగిరి, ముకుంద్, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రతీ శనివారం హనుమాన్ చాలీసా పారాయణం

బోథ్: సొనాల రామాలయంలో ప్రతీ శనివారం సాయంత్రం 7 గంటలకు హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని హిందూ. ధర్మజాగరణ మండలి సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్‌చాలీసా అనంతరం ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

వెల్ఫేర్ సొసైటీ కార్యాలయం ప్రారంభం

బోథ్: మండల కేంద్రంలో మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ కార్యాలయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీ అధ్యక్షుడు అనిల్ ప్రజలకు సేవ చేయడానికి కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు.

పరామర్శ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన చిన్న పొశెట్టి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న సోమవారం వారి ఇంటికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను ఆడిగి తెలుసుకున్నారు. పొశెట్టి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో సోమవారం పలు కుటుంబాలను బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పరామర్శించారు. గత రెండు రోజుల కిత్రం అనారోగ్యంతో మృతి చెందిన జాదవ్ కమలబాయి కుటుంబసభ్యులను పరామర్శించారు. గుండెపోటుతో మరణించిన గుమ్మడి సాయన్న కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మండల అభివృద్ధికి పాటుపడాలి

ఆదిలాబాద్‌రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీపీ గంద్రత్ రమేశ్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఆదిలాబాద్‌రూరల్ ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా శాఖల వారీగా ప్రగతి నివేదికలపై అధికారులు వివరించారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల ను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్, అధికారులు పాల్గొన్నారు.

'డిగ్రీ పరీక్ష కేంద్రం మార్చడం సరికాదు'

బేల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని ఆదిలాబాద్‌కు మార్చడం సరికాదని ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఈనెల 20నుంచి ప్రారంభమయ్యే 1,3, 5 సెమిస్టర్ పరీక్షలకు కాకతీయ యూనివర్సిటీ అధికారుల నిర్ణయంతో విద్యార్థులకు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. బేలలోనే కొనసాగించాలని కోరారు. ఏబీవీపీ నాయకులు ప్రీతం, నవనీత్, సాయి, సురజ్, జతిన్, వంశీరెడ్డి పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక దందా

- పెన్‌గంగ శివారు గ్రామాల నుంచి తరలింపు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- అందినకాడికి దండుకుంటున్న అక్రమార్కులు


ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక


పెన్‌గంగ ఒడ్డున ఇసుక నిల్వలు

తాంసి: భీంపూర్ మండలంలో పెన్‌గంగ నది నుంచి ఇసుక దందా మళ్లీ ఊపందుకుంది. ఇన్నిరోజుల పాటు పెన్‌గంగ నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో ఇసుక తవ్వకాలకు అడ్డంకిగా మారింది. ప్రస్తుతం నీటి ప్రవాహం తగ్గడంతో మళ్లీ ఇసుకను తరలిస్తూ.. అందినకాడికి దండుకుంటున్నారు. జిల్లా సరిహద్దుతో పాటు భీంపూర్ మండల శివారులోని ఆయా గ్రామాల గుండా ప్రవహిస్తున్న పెన్‌గంగ నది నుంచి ఇసుకదందా యథేచ్ఛగా సాగుతోంది. మండలంలోని గుబిడి, అంతర్గాం, వడూర్, తాంసి(కె) గ్రామాల శివారులో ఉన్న పెన్‌గంగ నది నుంచి నిత్యం ఇసుకను తరలిస్తున్నారు. ఈదందా మూడు పవ్వులు.. ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ట్రాక్టర్‌లలో ఇసుకను తరలిస్తున్నారు. ఈఏడాది వర్షాకాలంలో అధికంగా నీటి ప్రవాహం ఉండడంతో నది పరీవాహక ప్రాంతాల్లో చాలా చోట్ల పెద్ద ఎత్తున ఇసుకమేటలు వేశాయి. ప్రస్తుతం నీటి ప్రవాహం తగ్గడంతో అక్రమార్కులు ఇసుక దందాకు తెరలేపారు.

వీడీసీల ఆధ్వర్యంలో వేలం..

ఇసుకను తరలించేందుకు గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో అనధికారికంగా వీడీసీలు వేలం సైతం నిర్వహించడానికి సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే మండలంలోని ఒక గ్రామంలో వేలం నిర్వహించగా.. కొంత మంది జట్టుగా ఏర్పడి ఇసుక వేలంను దక్కించుకున్నారు. గ్రామాల అభివృద్ధి నిధుల పేరిట ఇసుక వేలం నిర్వహిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ, పోలీసు అధికారులతో ముందస్తుగానే ఒప్పందం కుదుర్చుకోని ఇసుక దందా చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. గతేడాది ఇసుక రవాణా అరికట్టడానికి అధికారులు ఇసుక తరలించే వాహనాలు సీజ్ చేయడం, జరిమానాలు విధించడంతో చేయడంతో కొంత వరకు అక్రమ రవాణాను అరికట్టారు. ఇటీవల దందా ప్రారంభం కావడంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

అక్రమార్కులకు లాభాలు..

గంటల వ్యవధిలో వేల రూపాయల సంపాదన ఉండడంతో ఈ దందాపై మొగ్గు చూపుతున్నారు. కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి రాజకీయ అండదండలతో ఇసుక రవాణాకు మార్గం సుగమం చేసుకుంటున్నారు. పెన్‌గంగ ఇసుకకి మంచి డిమాండ్ ఉండడంతో ఇసుక తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నారు. నదిఒడ్డున, పంటచేల సమీపంలో డంపులు ఏర్పాటు చేశారు. అవసరం ఉన్నప్పుడు ట్రాక్టర్‌లో, టిప్పర్‌లలో జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాలకు తరలించి ట్రాక్టర్‌కు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక రవాణాపై నిఘా పెట్టాం

పెన్‌గంగ నది ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తాం. గత నాలుగు రోజుల క్రితం మైనింగ్ అధికారులు ఇసుక తరలించే ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కి తరలించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిత్యం తనిఖీలు చేపట్టి వాహనాలు సీజ్ చేసి, జరిమానాలు విధిస్తాం.

– లాల్‌సింగ్ నాయక్, భీంపూర్ ఎస్సై

విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చర్యలు

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపడతామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కళాశాలలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం కళాశాల ఆవరణలో రూ.9.20 లక్షల నిధులతో రెండు మరుగుదొడ్లను నిర్మించడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో కళాశాలలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. విద్యార్థులు బాగా చదివి కళాశాలతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ పెంట వెంకట రమణ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్ రెడ్డి, సాబ్లే నానక్‌సింగ్, ప్రతాప్‌సింగ్, జహీర్, దేవేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ శబాన తరన్నమ్ పాల్గొన్నారు.

రెండు నెలల్లో రోడ్డు పనులు పూర్తి చేస్తాం

ఇచ్చోడ: మండల కేంద్రంలో నిర్మించనున్న రోడ్డు పనులను రెండు నెలల్లో పూర్తి చేస్తామని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని నిర్మల్ బైపాస్ నుంచి ఆదిలాబాద్ బైపాస్ వరకు రోడ్డుతో పాటు డివైడర్, సెంట్రల్ లైటింగ్ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. గత రెండు నెలల క్రితమే రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరైనట్లు తెలిపారు. రూ 16 కోట్ల 60 లక్షలతో రెండు వరుసల రోడ్డు, సెంట్రల్ లైటింగ్, డివైడర్ ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ, బోథ్ ఎంపీపీలు నిమ్మల ప్రీతంరెడ్డి, తుల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, నాయకులు గాడ్గే సుభాష్, పాండురంగ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

బోథ్: బోథ్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి మొదటిసారిగా వచ్చిన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్యాంపు కార్యాలయం ఆవరణలో ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ సంధ్యారాణి, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతం రెడ్డి, నేరడిగొండ ఎంపీపీ సజన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు తాహెర్ బిన్ సలాం, ఏఎంసీ చైర్మన్ రుక్మణ్ సింగ్, సర్పంచ్‌లు సురేందర్, వెంకట రమణ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

బోథ్ మండలంలోని ధన్నూర్(బి) గ్రామం నుంచి నాగాపూర్ గ్రామం వరకు రూ. 2 కోట్ల 10 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన పనులను సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ ప్రారంభించారు. నేరడిగొండ జెడ్పీటీసీగా ఉన్న సందర్భంగా నాగాపూర్ రోడ్డును మంజూరు చేయించానని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం ధన్నూర్ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను రెడ్డి సంఘం సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు.

గొల్లఘాట్ రోడ్డు పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..


రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

తాంసి: భీంపూర్ మండలంలోని గొల్లఘాట్ గ్రామానికి ఉన్న మట్టి రోడ్డును సోమవారం అధికారులు పరిశీలించారు. ఈనెల 5న 'గొల్లఘాట్‌కు మట్టి రోడ్డే దిక్కు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీరాజ్ ఏఈ మజర్ అధికారులతో కలిసి రోడ్డును పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్డు నిర్మాణం కోసం పిప్పల్‌కోటి దవల్‌మాలిక్ బాబా దర్గా నుంచి గొల్లఘాట్ వరకు ఉన్న నాలుగు కిలోమీటర్ల రోడ్డు పరిశీలించారు. రోడ్డు లేని గిరిజన గ్రామాలకు రోడ్ల నిర్మాణంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం బీర్సాముండా జయంతి సందర్భంగా ప్రధానమంత్రి జన్మన్ పథకాన్ని ప్రారంభించనుంది. దీనిలో భాగంగా గొల్లఘాట్ గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక రూపొందించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన సుబ్రహ్మణ్య షష్ఠి, కల్యాణ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కార్యవర్గం ఎన్నిక

బోథ్: సొనాల అంబేద్కర్ కార్యవర్గాన్ని ఆదివారం రాత్రి ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భగత్ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా పాటిల్ నరేశ్, ఉపాధ్యక్షుడిగా బొమ్మెత సంజయ్‌లను ఎన్నుకున్నారు. అంబేద్కర్ చూపినబాటలో నడుస్తూ.. ఆయన సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు.

బోరుబావి ఏర్పాటు

తాంసి: భీంపూర్ మండలంలోని టెక్డిరాంపూర్ పంచాయతీ పరిధిలోని కొజ్జన్‌గూడ గ్రామస్తులకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. సోమవారం గ్రామంలో బోరు వేయించారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, నరేందర్, శ్రీకాంత్, సంజీవ్ పాల్గొన్నారు.

సహకార సేవలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

తాంసి: రైతులు సహకార సంఘాల ఆధ్వర్యంలో వ్యవసాయ రుణాలతో పాటు వ్యవసాయేతర రుణాలను తీసుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రాథమిక సహకార సంఘం కార్యవర్గ సమావేశానికి హాజరయ్యాడు. సహకార సంఘం సభ్యులతో పలు అంశాలపై చర్చించారు. ప్రాథమిక సంఘాల ద్వారా ఏడీసీసీ బ్యాంకులో రుణాలను అందిస్తున్నామన్నారు. రైతులు తీసుకున్న రుణాలను చెల్లించి కొత్త రుణాలు తీసుకోవాలని సూచించారు. గోల్డ్‌లోన్, ఇళ్ల నిర్మాణానికి, వాహన కొనుగోలు కోసం తక్కువ వడ్డీ రేటుతో రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, సీఈవో కేశవ్, డైరెక్టర్‌లు బుజ్జన్న, నారాయణ, అశోక్ రెడ్డి, కార్యదర్శులు గణేష్, సుధాకర్, సిద్ధార్థ్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శతక పద్యార్చన


సామూహిక పద్యార్చన చేస్తున్న విద్యార్థులు

ఎదులాపురం/జైనథ్: వందకు పైగా తెలుగు సంఘాల సమన్వయంతో వందే విశ్వమాతరమ్ పేరుతో చిగురుమళ్ల శ్రీనివాస్ నిర్వహిస్తున్న శాంతి సద్భావన యాత్రలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో, కృష్ణవేణి టాలెంట్ స్కూల్, జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు అమ్మ, నాన్న, గురువు శతక పద్యార్చన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ ప్రశాంత్‌రెడ్డి, జిల్లా శాంతి సద్భావన యాత్ర కోఆర్డినేటర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నవనీత, ఉపాధ్యాయులు రవికాంత్, ప్రశాంత్, గణేశ్, హర్షిత్ పాల్గొన్నారు.

జాతర కరపత్రాలు ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఎదులాపురం: తాంసి మండలం గిరిగాం గ్రామం గురు దత్తాత్రేయ దేవాలయ 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి సోమవారం జాతర కరపత్రాలు ఆవిష్కరించారు. ఈనెల 25, 26వ తేదీల్లో ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాముహిక హోమం, కుంకుమార్చన వంటి కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

- కేవలం ఐదుగురు సర్పంచ్‌లు మాత్రమే హాజరు
- అధికారులకు బదులు హాజరైన అసిస్టెంట్లు
- 'భగీరథ' అధికారులపై మండిపడిన సభ్యులు


మాట్లాడుతున్న ఎంపీపీ కల్యాణం లక్ష్మి

తలమడుగు: మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం సోమవారం తూతూ మంత్రంగా సాగింది. ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్ అధ్యక్షణ నిర్వహించిన సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరు కాకపోవడంతో సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. 28 గ్రామ పంచాయతీల సర్పంచులకు కేవలం ఐదుగురు సర్పంచులు మాత్రమే హాజరయ్యారు. అలాగే మండల అధికారులు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ వివిధ కారణాలతో వారి అసిస్టెంట్లను పంపించడంతో ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నాలకు వారు సమాధానం చెప్పలేక పోయారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు చేపట్టిన మిషన్ భగీరథ పథకం ఇప్పటివరకు అందడం లేదని పలుమార్లు అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని మిషన్ భగీరథ అధికారులపై సభ్యులు మండిపడ్డారు. అనంతరం జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి మాట్లాడుతూ.. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జెడ్పీ సమావేశంలో జిల్లా అధికార దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అధికారులు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్, ఉపాధ్యక్షురాలు దివ్య, జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మండల పశువైద్యాధికారి దూద్‌రాం రాథోడ్, విద్యుత్ శాఖ ఏఈ సతీష్, ఐకేపీ ఏపీఎం స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: రోగులకు అందుబాటులో ఉండి, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. వార్డుల్లో తిరుగుతూ రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట వైద్యులు మహేందర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నాల్గో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో నాల్గో తరగతి ఉద్యోగులు నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. సమస్యలను సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు.

'వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి'



మాట్లాడుతున్న నాయకులు

ఎదులాపురం: వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు. కేవలం బండకొట్టుకుని బతుకు సాగిస్తున్న వడ్డెరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదుకోవాలన్నారు. తమను ఎస్టీల్లో చేర్చాలని 43 ఏళ్లుగా పోరాడుతున్నా.. పట్టించుకోవడం లేదన్నారు. గతంలో జిల్లా అధికారులకు సైతం తమగోడు వినిపించామని అయినా స్పందన లేదన్నారు. ఇందులో వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇంద్రవెల్లి: వడ్డెర కులస్తుల సమస్యలు పరిష్కరించాలని కుల సంఘం నాయకులు కోరారు. సోమవారం వడ్డెర కులసంఘం నాయకులు ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించారు. వడ్డెర కులస్తులు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారని, వారి సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే న్యాయమైన డిమాండ్లను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు జల్పెట్ సాయి, సూర సంతోష్, ప్రకాష్, మనోజ్, గోవింద్, కాసుల్‌వార్ రమణ, పవన్ పాల్గొన్నారు.

నిమోనియా మరణాలు అరికట్టాలి

కైలాస్‌నగర్: జిల్లాలో నిమోనియా మరణాలు అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. సోమవారం నుంచి ఫిబ్రవరి 29 వరకు నిర్వహించనున్న సాన్స్ ప్రచార కార్యక్రమాన్ని పుత్లీబౌలి అర్బన్ పీహెచ్‌సీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా ఐదేళ్లలోపు చిన్నారుల మరణాల్లో 17 నుంచి 18 శాతం వరకు నిమోనియా కారణమని తెలిపారు. ఈ మరణాలు తగ్గించేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఇందు కోసం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సాన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ట్లు పేర్కొన్నారు. ముందస్తుగా గుర్తించి చికిత్స అందిస్తే ఎలాంటి ప్రాణహాని ఉండదన్నా రు. జ్వరం, దగ్గు, జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం నిమోనియా వ్యాక్సిన్ కరపత్రాలు విడుదల చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వైసీ శ్రీనివాస్, మెడికల్ అధికారి ఫాతిమా పాల్గొన్నారు.

ఔషధ మొక్కలతో అనేక ప్రయోజనాలు


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెల్మల మధు

ఆదిలాబాద్‌రూరల్: ఔషధ మొక్కలతో అనేక ప్రయోజనాలు ఉంటాయని భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర లెక్చరర్ డాక్టర్ వెల్మల మధు అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన విస్తృతోపన్యాసంలో విద్యార్థులకు ఔషధ మొక్కల ప్రాధాన్యత, వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక రకాల ఔషధ మొక్కలతో మానవాళికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. చిన్నపాటి జబ్బులు వస్తే వైద్యుల వద్దకు వెళ్లకుండా వీటి ద్వారా నయం చేసుకోవచ్చని సూచించారు. ఇందుకోసం ప్రతిఒక్కరూ ఔషధ మొక్కలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు వి.శ్రీమాన్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్టహాసంగా సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి పూజ కార్యక్రమాలను సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు జోగు రామన్న దంపతులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి భక్తి కార్యక్రమాల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఆలయ సభ్యుల వెంట ఉంటూ.. సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుంబోజి సూర్యకాంత్, దాముక రవీందర్, ఆలయ వ్యవస్థాపక సభ్యులు తాటిపెల్లి శివప్రసాద్, ఆలయ తంత్రి సాయికృష్ణ దుబే, ఆలయ మాజీ ప్రధాన కార్యదర్శులు చంద గణేష్, ఆలయ కోశాధికారి టింగం నరేశ్, దిలీప్ పాల్గొన్నారు.